సాక్షి
వికారాబాద్
బుధవారం । 24 । జూలై । 2024



ఇం'ధనం'లేదు..

జీపీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే గ్రాంట్లు నిలిచిపోయాయి. దీంతో పంచాయతీలకు కష్టకాలం వచ్చింది. 16లో▸

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని రంగాలకు ప్రాధాన్యత కల్పించిందని.. నిధులు కేటాయించిందని.. బడ్జెట్ భేషుగ్గా ఉందని బీజేపీ నేతలు అంటుండగా.. తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని.. వివక్ష ప్రదర్శించారని.. ఈ బడ్జెట్ తీవ్ర నిరాశపర్చిందని, ఆద్యంతం మసిపూసి మారేడు కాయ చేసిన విధంగా ఉందని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు.

అన్ని రంగాలకు న్యాయం



చేవెళ్ల: అన్ని రంగాలకు సముచిత న్యాయం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. దేశం మొత్తం అభివృద్ధి జరిగేలా కేటాయింపులు ఉన్నాయి. యువత, మహిళలు, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం, పేదలు ఇలా అన్నింటికీ అవకాశాలు కల్పించింది. ఈ బడ్జెట్‌ను చూసి ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. అందుకే అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారు.

– కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీ, చేవెళ్ల

తెలంగాణకు తీవ్ర అన్యాయం



పరిగి: బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కు తీవ్ర అన్యాయం చేసింది. గతంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తీరును కూడా ప్రధాని మోదీ తప్పుబట్టారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచినా కేటాయింపులు లేకపోవడం దారుణం. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ప్రభుత్వాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా నిధులు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదు.

– రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పరిగి

కేంద్రానిది పచ్చి దగా



తాండూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ప్రజలను పచ్చి దగా చేశారనడంలో ఎలాంటి సందేహం లేదు. బడ్జెట్ ఆద్యాంతం మసిపూసి మారేడు కాయ చేసిన విధంగా ఉంది. కేటాయింపుల్లో సరైన ప్రణాళిక లేదు. నమ్మిన వారిని నయవంచన చేసే విధంగా బడ్జెట్ ఉంది. ప్రభుత్వం కూలిపోకుండా ఉండేందుకు మాత్రమే ఈ బడ్జెట్ ఉన్నట్లు అనిపించింది. రాష్ట్రంలో 8మంది ఎంపీలను గెలిపించారు. తెలంగాణకు అధిక నిధులు వస్తాయనుకుంటే ఇక్కడి ప్రజలను మోసం చేశారు.

– మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

న్యూస్‌రీల్

ధరణి సమస్యలు పరిష్కరించండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



ధరణి పెండింగ్ ఫైళ్లను పరిశీలిస్తున్న లింగ్యానాయక్, అధికారులు

కుల్కచర్ల: ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. మంగళవారం చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు భూ సమస్యలపై ఇచ్చిన అర్జీలను పరిశీలించాలని ఆదేశించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ ప్రభులు, గిర్దవరి వెంకటగిరి, సీనియర్ అసిస్టెంట్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సీఎంఆర్ ఇవ్వాలి

దోమ: రైస్ మిల్లర్లు నాణ్యమైన సీఎంఆర్‌ను ఇవ్వాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని మోత్కూర్ గేట్ వద్ద గల రైస్ మిల్లును ఆర్డీఓ వాసుచంద్రతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అందులో భాగంగా పేదలకు రేషన్ బియ్యం సరఫరా చేస్తోందని వివరించారు. సీఎంఆర్‌ను ప్రజలకు సరఫరా చేస్తామని.. మిల్లర్లు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మిల్లు యజమాని శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఖర్గేకు బొకే అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను మంగళవారం ఢిల్లీలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాలపై ఆరా తీశారు. రైతు రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో పార్టీ స్థితిగతులు, ప్రభుత్వ పనితీరుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానా పటోల్ ఉన్నారు.

అవకాడో పంటను పరిశీలించిన మాజీ మంత్రి



కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడలో రైతు జైపాల్‌నాయక్ పండిస్తున్న అవకాడో పంటను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. పంట సాగు చేసిన విధానం, దిగుబడి తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు ఆయనకు అవకాడో పండ్లు, మొక్కలను అందజేశారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించినప్పుడే పరిసరాల శుభ్రత



- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటాం
- వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి
- తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



తాండూరు: ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేస్తూ ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి అన్నారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డితో ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగింది. పట్టణ ప్రజలు వివిధ సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాల వల్ల పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న సహకారంతో మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. జిల్లాలోనే తాండూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

ప్రశ్న: 2వ వార్డులో ఓపెన్ ప్లాట్లలో కంప చెట్లతోపాటు మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు నీరు రోడ్లపై పారుతోంది. దోమల బెడద ఎక్కువైంది. వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించాలి.

– నాగమ్మ, 2వ వార్డు, మల్‌రెడ్డిపల్లి, తాండూరు

కమిషనర్: 2వ వార్డులో ఖాళీ స్థలాలు, ఓపెన్ ప్లాట్లుగా వదిలేసిన వారికి నోటీసులు జారీ చేస్తాం. వర్షాలు పడుతున్నందున ప్రజలు కాచి వడబోసిన నీటినే తాగాలి. వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న: 11వ వార్డులో రోడ్డును లెవల్ చేయాలి. మురుగు కాలువ లోతుగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రోడ్డు వేయడంతోపాటు పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేయాలి.

– నర్సింహులు,11వ వార్డు సాయిపూర్, తాండూరు

కమిషనర్: 11వ వార్డులో రోడ్డుకు మరమ్మతులు చేస్తాం. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. వెంటనే పనులను ప్రారంభిస్తాం.

ప్రశ్న: 6వ వార్డులో మాంసపు వ్యర్థాలను డంపింగ్ చేయడంతో దుర్వాసన వస్తోంది. వ్యర్థాలను వేయరాదని చెప్పినా వినడం లేదు. మల్లప్ప మడిగె నుంచి చంద్ర టాకీస్ మార్గంలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్లు, షాపుల ఎదుట లారీలను పార్కింగ్ చేయడంతో సమస్య వస్తోంది.

– విజయ్, 6వ వార్డు, తాండూరు

కమిషనర్: చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులతో మాట్లాడి మాంసపు వ్యర్థాలు వేయకుండా ఆదేశాలు జారీ చేస్తాం. అలాగే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. లారీల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించేలా చూస్తాం.

ప్రశ్న: 24వ వార్డు సెయింట్ మార్క్స్ స్కూల్ వద్ద డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పందుల సంచారం, వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– కావలి సంతోష్, 24వ వార్డు, తాండూరు

కమిషనర్: రెండు రోజుల్లో సెయింట్ మార్క్స్ స్కూల్ వద్ద పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు మురుగు కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. కుక్కలకు హాని కలిగిస్తే చట్టం ఒప్పుకోదు. తమ వంతు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పాతకుంట ప్రాంతంలో అంతర్గత రోడ్లు లేక ఇళ్ల మధ్య వర్షపు నీరు నిలుస్తోంది. రైల్వే వంతెన నుంచి చైతన్య స్కూల్ వరకు రోడ్డును లెవెల్ చేయాలి.

– నవీన్‌కుమార్, పాతకుంట, తాండూరు

కమిషనర్: పాతకుంట ప్రాంతంలో అంతర్గత రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపడతాం. కొత్తగా రోడ్లు వేయాలంటే నిధుల కేటాయింపులు జరగాలి.

ప్రశ్న: సాయిపూర్ ముత్యాల గల్లీలో వినియోగదారులకు గృహలక్ష్మి పథకం అమలు కావడం లేదు. జీరో బిల్లు వచ్చేలా చూడాలి.

– విష్ణువర్ధన్‌రెడ్డి, ముత్యాలగల్లీ, తాండూరు

కమిషనర్: అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికీ జీరో బిల్లు అమలయ్యేలా చూస్తాం.

ప్రశ్న: మల్‌రెడ్డిపల్లి 24 వార్డులో రోడ్లు, మురుగు కాలువలు శుభ్రంగా లేవు. కాలువల్లో చెత్తను తొలగించాలి. దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.

– సుభాన్‌రెడ్డి, 24వ వార్డు, మల్‌రెడ్డిపల్లి

కమిషనర్: మల్‌రెడ్డిపల్లి 24 వార్డులో రోడ్లు, మురుగు కాలువలను వెంటనే బాగు చేయిస్తాం. వర్షాలు పడుతున్నందున ఫాగింగ్ చేయలేక పోయాం. వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: 13వ వార్డు అయ్యప్పనగర్ కాలనీలో 20 రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. పలు సార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తెచ్చాం. కొన్ని ఇళ్లకు తక్కువగా నీరు వస్తోంది. అయ్యప్ప నగర్ ఆలయం వద్ద ఉన్న ఇళ్లకు నీరు సరఫరా కావడం లేదు.

– కరణం వామన్‌రావు, అయ్యప్పనగర్, తాండూరు

కమిషనర్: అయ్యప్ప నగర్ ప్రాంతంలో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం. లోపం ఉందో తెలుసుకొని సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.

ప్రశ్న: ఇందిరమ్మ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద రోడ్డు సమస్య ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేదు. దీంతో ప్రమాదం పొంచి ఉంది. కాలనీలోని స్కూల్ ఎదుట మురుగు నీరు నిలుస్తోంది. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలి.

– జిలానీ, ఇందిరమ్మ కాలనీ, తాండూరు

కమిషనర్: ఇందిరమ్మ కాలనీలో రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. పారిశుద్ధ్య పనులు చేపడతాం. మురుగు నీరు నిలవకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖకు సూచిస్తాం.

ప్రశ్న: ఇంద్రానగర్ 6వ వార్డులో ఓపెన్ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థను మెరుగు పర్చాలి. పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు కలుషితం అవుతోంది.

– వెంకట్, 6వ వార్డు, తాండూరు

కమిషనర్: మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తాం. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపడతాం.

ప్రశ్న: 7వ వార్డు ఎన్‌టీఆర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పార్కులను ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– ఇర్షాద్, 7వ వార్డు, తాండూరు

కమిషనర్: ఎన్‌టీఆర్ కాలనీతో పాటు హుస్సేన్ నగర్‌లో వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి వెంటనే పనులను ప్రారంభిస్తాం.

ప్రశ్న: భవానీ నగర్ 10 వార్డులో రోడ్లను శుభ్రం చేయడం లేదు. దీంతో చెత్తాచెదారం పేరుకు పోయింది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– సులేమాన్, 10 వార్డు, తాండూరు

కమిషనర్: మున్సిపల్ పరిధిలోని ప్రధాన రోడ్లను ప్రతిరోజూ శుభ్రం చేయిస్తున్నాం. పారిశుద్ధ్య కార్మికుల కొరత వల్ల కొంత ఇబ్బంది ఉంది. రోడ్లను నిత్యం శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న: వాసవీ కాలనీ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలంలో కంప చెట్లు, మొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది. ఈ ప్రాంతం విష సర్పాలకు ఆవాసంగా మారింది. వైష్ణో హీరో హోండా షోరూం వద్ద కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యలు పరిష్కరించాలి.

– నరేందర్, వాసవీ కాలనీ, తాండూరు

కమిషనర్: వాసవీ కాలనీలో ఇళ్ల సముదాయాల వద్ద ఖాళీగా వదిలేసిన స్థలం యజమానికి నోటీసులు జారీ చేస్తాం. కంప చెట్లను తొలగించకపోతే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: విశ్వంభర కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రోడ్లు గుంతలమయంగా మారడంతో ఇబ్బంది పడుతున్నాం.

– అన్నపూర్ణ, విశ్వంభర కాలనీ, తాండూరు

కమిషనర్: విశ్వంభర కాలనీలో వీధి దీపాల సమస్య లేకుండా చూస్తాం. గుంతలు పడిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతుల చేయిస్తాం.

ప్రశ్న: శాంతినగర్ పార్కు అధ్వానంగా మారింది. పక్కనే బస్ స్టేషన్ ఉండటంతో ప్రయాణికులు అక్కడ సేద తీరుతుంటారు. పార్కును అందుబాటులోకి తేవాలి. శాంతినగర్‌కు వెళ్లే మార్గంలో ఇరువైపులా ఆటోలు నిలపడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

– మహమ్మద్ జమీర్, శాంతినగర్, తాండూరు

కమిషనర్: శాంతి నగర్ పార్కును శుభ్రం చేయించి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. రోడ్డుకు ఇరువైపులా ఆటోలను నిలపకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: చిచోళి రోడ్డులో గల పెద్ద డ్రైనేజీతో ఇబ్బంది పడుతున్నాం. డ్రైనేజీ నుంచి వచ్చే దుర్వాసన భరించలేక పోతున్నాం. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– ఆంజనేయులు, తాండూరు

కమిషనర్: డ్రైనేజీని శుభ్రం చేయించి మురుగు నిలవకుండా చూస్తాం. రోడ్లపై, మురుగు కాలువల్లో చెత్త వేయరాదు. మున్సిపల్ అధికారులకు పట్టణ ప్రజలు సహకరించి మెరుగైన సేవలు పొందాలి.



ప్రజల సమస్యలను నోట్ చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు



విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

విద్యుత్ కనెక్షన్‌లో జాప్యం వద్దు

- ఆగస్టు 20లోగా పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్
- విద్యుత్ శాఖ ఇంజనీర్లు, అధికారులతో సమీక్ష

కొడంగల్ రూరల్: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని కడా కార్యాలయంలో జిల్లాలోని విద్యుత్ శాఖ ఇంజనీర్లు, అధికారులతో వ్యవసాయ రంగంలో విద్యుత్ సరఫరా పురోగతిపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు ఎంతో ఖర్చు పెట్టి బోర్లు వేసుకుంటారని, విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో ప్రయోజనం ఉండదని తెలిపారు. కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం చేయడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను ఆగస్టు 20లోగా పూర్తి చేయాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్ కనెక్షన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. మున్సిపల్, మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి విద్యుత్‌శాఖ అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. అంతకుముందు కడా కార్యాలయంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద చేపట్టే పనులను పవర్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో వికారాబాద్ ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి, డీఈ సంజీవి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

కుల్కచర్ల: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని ఆ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. మంగళవారం చౌడాపూర్ మండలం విఠలాపూర్‌లో పలువురు రైతులు సాగు చేసిన పంటను పరిశీలించారు. ప్రస్తుతం రైతు బీమా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో అర్హతగల రైతులు ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలన్నారు.



విఠలాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న గోపాల్, తదితరులు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



చుక్కాపూర్‌లో నాటిన మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు

- రంగారెడ్డి డీఆర్‌డీఓ శ్రీలత

తలకొండపల్లి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. లక్ష్య సాధన కోసం అధికారులంతా కృషి చేయాలని సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం వన మహోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీలతతో పాటు, అసిస్టెంట్ డీఆర్‌డీఓ సుభాషిణి, ఏపీడీ సక్రియ, జిల్లా ప్లాంటేషన్ అధికారిణి సంధ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి పంచాయతీ పరిధిలో 6 వేల మొక్కలను కచ్చితంగా నాటేలా చూడాలని అధికారులకు సూచించారు. హార్టికల్చర్‌లో మల్బరీ తోటలు, బండ్ ప్లాంటేషన్, పామాయిల్, జామ, కమ్యూనికేషన్ ప్లాంటేషన్, మల్టీ లేయర్ ప్లాంటేషన్, ఈత, బాక్ల్ ప్లాంటేషన్ కింద తగిన ప్రదేశాలను గుర్తించి, గుంతలు తీసి మొక్కలు నాటాలని అన్నారు. వచ్చే నెల చివరి నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలని, లేదంటే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రామచంద్రయ్య, ఎంపీడీఓ శ్రీకాంత్, ఏపీఓ కృష్ణ, కార్యదర్శులు, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్వహణ భేష్



జిల్లా ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న కాయకల్ప బృంద సభ్యులు

- కాయకల్ప అధికారులు
- వసతులను పరిశీలించిన రెండు బృందాలు

తాండూరు టౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని కాయకల్ప అధికారులు మంగళవారం పరిశీలించారు. రెండు బృందాలుగా విడిపోయి ఆస్పత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మార్చురీ, అత్యవసర విభాగం, రోగుల వార్డులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, వ్యర్థ పదార్థాల మేనేజ్‌మెంట్, తాగునీటి సరఫరా, ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. మరో బృందం మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోని లేబర్ రూం, నవజాత శిశువు గది, స్టెరిలైజేషన్ రూం, భోజన వసతి, ల్యాబ్ తోపాటు పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాయకల్ప బృందం సభ్యుడు డాక్టర్ దశరథ్ మాట్లాడుతూ.. రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందిస్తూ, అన్ని మౌలిక వసతులను కలిగి ఉన్న ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం కాయకల్ప అవార్డులతో ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఆస్పత్రికి రూ. 60 లక్షల వరకు మెరుగైన వసతుల కల్పన కోసం నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అక్కడక్కడ భవన పెచ్చులూడటం, రంగు వెలిసిపోవడం మినహా అన్ని సదుపాయాలు, వైద్య సేవలు బాగున్నాయని అన్నారు. రెండేళ్ల క్రితం తాండూరుకు కాయకల్ప అవార్డు వచ్చిందని, ఈసారి తాండూరు అవార్డు కోసం రేసులో ఉన్నట్లు చెప్పారు. తగు నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తి, ఆర్ఎంఓ అనిల్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రుణమాఫీ అర్హుల వివరాల సేకరణ

దౌల్తాబాద్: అర్హులై ఉండి రూ.లక్ష లోపు పంట రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. మండల కేంద్రంలో వ్యవసాయ అధికారి లావణ్య ఆధ్వర్యంలో ఏఈఓలు అర్హులై ఉండి రుణ మాఫీ కాని రైతుల పేర్లు, ఆధార్ నంబరు, తదితర వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటున్నారు. ఆధార్‌కార్డులోని పేరు, బ్యాంకు ఖాతాలో రైతు పేరులో తేడాలుండడం, ఒకే రేషన్‌కార్డులో నమోదై ఉన్న ఇద్దరు పంట రుణాలు తీసుకుని ఉండడం, తదితర కారణాలతో పలువురు రైతులకు రుణమాఫీ కావడంలేదని అధికారులు తెలిపారు. రైతుల నుంచి సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు అర్హులైన వారికి రుణమాఫీ అమలయ్యేలా కృషి చేస్తామని ఏఓ లావణ్య వివరించారు.

వ్యవసాయశాఖలో బదిలీలకు బ్రేక్..!

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని శాఖల్లో బదిలీల పరంపరం కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణ మాఫీ ప్రక్రియ ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. దీంతో ప్రస్తుతానికి వ్యవసాయ శాఖ బదిలీలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. రైతురుణ మాఫీకి సంబంధించి రైతుల అనుమానాలను నివృత్తిలో వ్యవసాయశాఖ అధికారులు కీలకంగా మారారు. రుణమాఫీ ప్రక్రియ ముగిసిన తర్వాతే బదిలీలు అయ్యే అవకాశం ఉందని ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

కొత్తూరు: మద్యం తాగి వాహనాలు పడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం హెచ్చరించారు. మంగళవారం ఆయన కొత్తూరు పట్టణంలోని వై జంక్షన్ కూడలి సమీపంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీని పరిశీలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడిపితే వారితో పాటు ఇతరులు ప్రమాదాలకు గురవుతారని వివరించారు. ముఖ్యంగా పెద్దలు మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో కూడా వాహనాలు ఇవ్వొద్దన్నారు. వాహనాలకు నంబర్‌ప్లేట్లు కనిపించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు, వాహనదారులు కూడళ్ల వద్ద రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి సూచికలు లేకుండా అకస్మాత్తుగా వాహనాలను ఇతర రూట్లోకి మళ్లించడం.. రోడ్డు పక్కన నిలపడం ప్రమాదాలకు కారణమన్నారు. కొత్త ట్రాఫిక్ చట్టాలు చాలా కఠినంగా ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు టన్నుల నల్లబెల్లం సీజ్

ముగ్గురు నిందితులకు రిమాండ్



ఎక్సైజ్ అధికారుల అదుపులో నిందితులు

తాండూరు: అక్రమంగా నల్లబెల్లాన్ని తరలిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. తాండూరు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఓమ్లానాయక్ తండాకు చెందిన రాథోడ్ పాండునాయక్, రాథోడ్ ఓంసింగ్, రాథోడ్ సచిన్ కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి ఐదు టన్నుల నల్లబెల్లాన్ని కొనుగోలు చేసి తండాకు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్, డీటీఎఫ్ అధికారులు ఎక్సైజ్ సీఐ నిజాముద్దీన్, డీటీఎఫ్ ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ సిబ్బందితో కలిసి ఓమ్లానాయక్ తండా వద్ద మాటు వేశారు. వాహనం తండా శివారులోకి రాగానే వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులు చుట్టుముట్టారు. వాహనంలో నల్లబెల్లాన్ని గుర్తించి సీజ్ చేసి తాండూరు ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. వారి వద్ద ఉన్న నాటుసారా, లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గతంలో వీరిపై పాత కేసులున్నాయని వెల్లడించారు. రాథోడ్ పాండు నాయక్ పలుమార్లు పట్టుబడినా తీరు మారకపోవడంతో రూ.2లక్షలకు పైగా జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఏఈ ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది శివ, విష్ణు, హన్మంతు, రవికుమార్ తదితరులున్నారు.

ఇంధనం లేదు.. ట్రాక్టరు కదలదు

అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కువ.. ఇటువంటి పరిస్థితుల్లో పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్త సేకరణ ట్రాక్టర్లకు డీజిల్ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది.

నిలిచిన ప్రభుత్వ గ్రాంట్లు
- చెత్త సేకరణకు నిధుల లేమి
- ఇబ్బందుల్లో పంచాయతీలు



ఎన్కేపల్లిలో చెత్త సేకరణ చేస్తున్న పంచాయతీ కార్మికులు(ఫైల్)

మోమిన్‌పేట: గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే గ్రాంట్లు నిలిచిపోయాయి. దీంతో పంచాయతీలకు కష్టకాలం వచ్చింది. ప్రతి రోజు చెత్త సేకరణ చేసేందుకు ఏర్పాటు చేసుకున్న ట్రాక్టరుకు డీజిల్‌కు సైతం నిధులు లేక నిస్తేజంగా మారాయి. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీల్లో కార్యదర్శులకు పనుల నిర్వహణ భారంగా మారింది. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే విధిగా చెత్త సేకరణ, మురుగు కాల్వల వెంట గడ్డి తొలగించాలి. వీధి దీపాల ఏర్పాటు సైతం తప్పనిసరి. నిధుల లేమితో పంచాయతీ కార్యదర్శులు సైతం చేసేదేమీ లేక మిన్నకుండిపోతున్నారు.

నిలిచిన చెత్త సేకరణ

గతంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఫైనాన్సు నిధులను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమచేసేది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులను పంచాయతీలకు అందించేది. ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లను నిలిపివేయడంతో సమస్యలు వచ్చిపడుతున్నాయి. మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో మోమిన్‌పేట, మొరంగపల్లి, వెల్‌చాల్, కేసారం, ఏన్కతల, టేకులపల్లి, మేకవనంపల్లి, చీమల్‌దరి గ్రామాల్లో జనరల్ ఫండ్ నిధులుండడంతో పంచాయతీల నిర్వహణకు ఇబ్బందులు లేవు. మిగిలిన 20 గ్రామ పంచాయతీల్లో నిధులు లేక కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని గోవిందపూర్‌లో వారం రోజులుగా చెత్త సేకరణ నిలిచిపోయిందని గ్రామస్తులు ఈ నెల 22న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా పంచాయతీ ట్రాక్టర్ల డీజిల్‌కు సొంత డబ్బు వెచ్చిస్తున్నామని వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను విడుదల చేసి పంచాయతీల అభివృద్ధికి పాటు పడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులిస్తేనే పరిష్కారం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న గ్రాంట్లు నిలిచిపోయాయి. కార్మికుల వేతనాలకు సంబంధించిన నిధులు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. ట్రాక్టర్ల ఈఎంఐ, చెత్త సేకరణకు డీజిల్, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, వీధి దీపాల ఏర్పాటుకు చిన్న పంచాయతీలకు ఇబ్బందులు ఉన్నాయి. ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తేనే ఇబ్బందులు తప్పుతాయి.

– యాదగిరి, ఇన్‌చార్జి ఎంపీడీఓ, మోమిన్‌పేట

దివ్యాంగులను అవమానిస్తే ఊరుకోం

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగ సంఘం నాయకులు

పరిగి: దివ్యాంగులను అవమానించిన స్మిత సబర్వాల్‌కు ఐఏఎస్‌గా కొనసాగే హక్కు లేదని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్ అన్నారు. ఈ మేరకు స్మిత సబర్వాల్‌పై ఎన్‌పీఆడీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం దశరథ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం దివ్యాంగులకు కల్పించిన హక్కులపై మాట్లాడే హక్కు ఆమెకు లేదన్నారు. దివ్యాంగులను అవమాన పరిచిన స్మిత సబర్వాల్‌పై కేసు నమోదు చేయాలన్నారు. ప్రతిభ ఎవరి సొత్తుకాదని.. అంగ వైకల్యం ఉన్న ఎంతో మంది అద్భుతాలు సృష్టిస్తున్నారని గుర్తు చేశారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశ వ్యాప్తంగా నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, ఆంజనేయులు, నర్సింలు, సత్తెమ్మ, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



ఎద్దు కళేబరం వద్ద రైతు

ధారూరు: పిడుగుపాటుకు ఎద్దు మృత్యువాత పడింది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని ఎబ్బనూరు గ్రామానికి చెందిన బేగరి రాజయ్య కాడెడ్లను మేతకు తీసుకెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలోనే ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తుండడంతో కాసేపటికి వెళ్దామని ఆగిపోయాడు. భారీ వర్షానికి రెండు ఎడ్లు దూరం దూరంగా ఉన్న సమయంలో ఒక ఎద్దుపై పిడుగుపడి మృతి చెందింది. దూరంగా నిలబడిన రైతు రాజయ్య పరుగున ఎద్దు వద్దకు వచ్చి చూడగా విగత జీవిగా కన్పించడంతో కన్నీటిపర్యంతమయ్యాడు. ఎద్దు విలువ సుమారు రూ.75 వేలు ఉంటుందని.. ప్రభుత్వమే రైతును ఆదుకోవాలని మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి కోరారు.

మత్తును చిత్తు చేద్దాం

- ఎస్పీ నారాయణరెడ్డి
- 104.53 కిలోల గంజాయి కాల్చివేత



గంజాయిని కాల్చివేసే ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

అనంతగిరి: కలిసికట్టుగా డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దామని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా 31 కేసుల్లో పట్టుబడిన 104.53 కిలోల గంజాయిని కాల్చివేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వికారాబాద్ కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లోని మెడికేర్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గంజాయిని బూడిద చేశామన్నారు. పిల్లల అలవాట్లపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. పోలీస్ శాఖ తరుపున మత్తు పదార్థాల రవాణా, వ్యాపారం, సేవించే వారిపైన దృష్టి పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పంటసాగులో సూచనలు తప్పనిసరి



ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న గోపాల్

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

దోమ: రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంతో పాటుగా పలు గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం దోమ రైతువేదికలో పత్తి పంటలో చీడ పీడల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ దుకాణదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు అధికారుల సూచనలతో పంటలను సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్‌రావు, ఏఈఓలు కావ్య, బాబ్య, తదితరులు పాల్గొన్నారు.

కంది పంటకు గొడ్డుమోతు తెగులు

డాక్టర్ సుధాకర్



వ్యాధి సోకిన కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

దుద్యాల్: కంది పంటలకు ప్రస్తుతం గొడ్డుమోతు తెగులు సోకుతోందని కంది పంట ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం తాండూరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్, శాస్త్రవేత్త యమునారెడ్డి తెలిపారు. మంగళవారం వారు మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో ఎంట్ల మల్లయ్య, బొంగు బుగ్గప్ప, నర్సింలు, బొంగు చిన్న అంజిలప్ప ఫిర్యాదు మేరకు ఏడీఏ శంకర్‌రాథోడ్‌తో కలిసి కంది పంటను పరిశీలించారు. పంటకు గొడ్డుమోతు తెగులు సోకిందని నిర్ధారించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. తెగులు సోకిన మొక్కలను తొలగించాలని సూచించారు. ఆరోగ్యకరమైన మొక్కలను రక్షించుకునేందుకు 3 నుంచి 5గ్రాముల డైకోఫోల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

లోపాలు గుర్తించేందుకు ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రయాదవ్

- డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీంద్రయాదవ్
- 'బాలస్వాస్థ్య'పై ఒక రోజు శిక్షణ

బొంరాస్‌పేట: పుట్టక నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలో చిన్నతనం నుంచే ఉండే లోపాలను గుర్తించేందుకు ×బాల స్వాస్థ్య×చేపట్టామని డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీంద్రయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రయాదవ్ మాట్లాడుతూ.. బొంరాస్పేట మండలాన్ని బాలస్వాస్థ్య కార్యక్రమం చేపట్టేందుకు పైలట్ ప్రాజెక్టుగా చేపట్టినట్టు వివరించారు. సున్నా నుంచి 18 ఏళ్ల వయసున్న పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, వంశపారపర్యంగా వచ్చే లోపాలు, పెరుగుదల లోపాలు గుర్తించాలన్నారు, అంగవైకల్యం, 25 రకాల ప్రశ్నలతో కూడిన సర్వే ఉంటుందన్నారు. ఇంటింటి సర్వే చేసి రోగులను గుర్తించాలన్నారు. అవసరమైన వారికి జిల్లా స్థాయి ఆస్పత్రుల్లో చికిత్స ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ హేమంత్ కుమార్, సీహెచ్ఓ శివ రాజ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి: నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు యువకుల నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన ప్రంజల్ గోగొయ్(25), అభినష్(24)లు స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. వీరు పక్క రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి మోకిల చుట్టుపక్కల గ్రామాల్లో పనిచేసే కూలీలకు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం గంజాయి సరఫరా చేసేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా.. పోలీసులు వారి వద్ద నుంచి 4.2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బాల్యానికి బ్యాగుల మోత

పెరుగుతున్న పుస్తకాల బరువు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ఆటపాటలతో బడికి వెళ్లాల్సిన బాల్యాన్ని పుస్తకాల బరువు వెన్ను వంచుతోంది. దీంతో చిన్నారులు పసిప్రాయంలోనే అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యా హక్కు చట్టాన్ని పట్టించుకోవడం లేదు.



దౌల్తాబాద్: బడికి వెళ్లే చిన్నారులు బ్యాగు బరువుతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా తమ సొంత సిలబస్‌తో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ సంఖ్య పెంచుతున్నాయి. దీంతో బ్యాగుల బరువు మోయలేక విద్యార్థుల వెన్నులు వంగిపోతున్నారు. పుస్తకాలకు తోడు టిఫిన్ బాక్స్, వాటర్ బాటిళ్లు, బూట్లు తదితర వస్తువులు మరింత భారంగా మారాయి. పుస్తకాల బరువుపై ప్రభుత్వం ఐదేళ్ల క్రితమే మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడంలేదు.

పసిప్రాయంలోనే అనారోగ్య సమస్యలు

మండల పరిధిలోని 33 పంచాయతీల్లో 50 పాఠశాలలున్నాయి. ఇందులో ఆరు ప్రైవేట్ పాఠశాలలు. ఆరు సబ్జెక్టులతో పాటు ఒక రఫ్ బుక్ ఉండేది. కానీ ఇప్పుడు సబ్జెక్టుకు ఒక రఫ్ బుక్‌తో పాటు గైడ్లు, ప్రాజెక్టు వర్క్, డ్రాయింగ్, స్క్రాప్ బుక్స్, రికార్డులు, డైరీలు ఇలా స్కూల్ బ్యాగులో కిలోల కొద్దీ పుస్తకాలు మోయాల్సి వస్తోంది. 7వ తరగతి వరకు ఆరు నుంచి 12కిలోలు, 8,9,10వ తరతగతి విద్యార్థులు 12నుంచి 18 కిలోల బ్యాగులను ప్రతి రోజు మోస్తున్నారు. కొన్ని పాఠశాలల బస్సులు గేట్ వరకు మాత్రమే వెళ్తుండడంతో అక్కడి నుంచి తరగతులకు మోయలంటే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పుస్తకాల భారంతో పిల్లలో వెన్నునొప్పి, జాయింట్ పెయిన్స్‌తో ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందులకు గురిచేయొద్దు

ప్రైవేట్ పాఠశాలల్లో అవసరం కంటే ఎక్కువ నోట్ బుక్స్ ఇవ్వకూడదు. ప్రాజెక్టు బుక్స్, టెక్ట్స్ బుక్స్ పాఠశాలలోనే ఉంచేలా ఏర్పాటు చేసుకోవాలి. పిల్లలను ఇబ్బందులకు గురిచేయొద్దు.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

నిబంధనలు పాటించని యాజమాన్యాలు

చిన్నారులకు బ్యాగుల బరువు తగ్గించేందుకు రాష్ట్ర విద్యాశాఖ 2017లో మార్గదర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం 1,2 తరగతులకు 1.5కిలోలు, 3నుంచి 5వతరగతులకు 3కిలోలు, 6, 7 తరగతులకు 4కిలోలు, 8,9,10 తరగతులకు 5కిలోలు ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కానీ ఇవేమీ పట్టని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సొంత సిలబస్ అంటూ పుస్తకాలు, నోట్‌బుక్స్ బరువులను మరింత పెంచి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి బ్యాగుల మోత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్ర ఉద్యమకారుల సంఘం జిల్లా ఇన్‌చార్జిగా సంజయ్



బషీరాబాద్: తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా సంజయ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి రవి మంగళవారం సంజయ్‌కు నియామక పత్రం అందజేశారు. బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్ గ్రామానికి చెందిన సంజయ్‌గౌడ్ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని పలు పోలీసు కేసుల్లో జైలుకు వెళ్లాడు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యమ కారులందరికీ 250 గజాల ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందని, ఇళ్లస్థలాల సాధన కోసం కార్యచరణ చేపట్టినట్లు సంజయ్ చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించే వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులను ఏకంచేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. తనను ఇన్‌చార్జిగా నియమించిన పిడమర్తి రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

తలకొండపల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి ఆవు మృతి చెందింది. మండలంలోని గట్టుఇప్పలపల్లికి చెందిన గుద్దేటి బాలయ్య జీవనోపాధి కోసం ఆవును కొన్నాడు. మంగళవారం బాలయ్య పొలంలో ఆవు మేసుకుంటూ సమీప ప్రాంతంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు రూ.1.20 లక్షలు నష్టపోయాయని బాధిత రైతు ఆవేదన చెందుతున్నాడు.

పతకాలను ఈదేశాడు

స్విమ్మింగ్‌లో రాణిస్తున్న 11 ఏళ్ల శ్రీరామ్

హుడాకాంప్లెక్స్: రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన 7వ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024లో తుక్కుగూడకు చెందిన శ్రీరామ్ కందుల అత్యుత్తమ ప్రతిభను చాటి బంగారు పతకం సాధించాడు. ఉదయ్‌పూర్‌లోని మహారాణా ప్రతాప్ ఖేల్‌గోల్ స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 19 నుంచి 21 మధ్య ఈ జాతీయ పోటీలు నిర్వహించారు. తెలంగాణ నుంచి శ్రీరామ్ పాల్గొనగా జూనియర్ కేటగిరిలో ప్రతిభ కనబరిచాడు. 11 ఏళ్ల వయసులో అతడు ఏకంగా ఆరు పతకాలను వివిధ పోటీల్లో సొంతం చేసుకున్నాడు. కోచ్‌లు దినేష్, రాజోరియా, సురేంద్రల పర్యవేక్షణలో అతడు శిక్షణ పొందాడు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు

43 కేంద్రాలకు నిధులు మంజూరు



జనగాం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జర్నప్ప

పెద్దేముల్: మండల పరిధిలోని 43 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ జర్నప్ప, అంగ్‌వాడీ సూపర్‌వైజర్ రాణి చెప్పారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన పెద్దేముల్, మారేపల్లి, జనగాంతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతీ కేంద్రంలో వందశాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని.. వారికి సంపూర్ణ పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలోని 59 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను ప్రభుత్వం 43 కేంద్రాలల్లో మరమ్మత్తులు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్, టాయిలెట్స్ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. అంగన్‌వాడీ భవనాలకు రంగులేసి బోర్డులు ఏర్పాటు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్, అంగన్‌వాడీ టీచర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు



ఉత్సవాలకు హాజరైన మంజుల తదితరులు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వెంకటాపూర్ తండాలో బోనాల ఉత్సవాలు వైభంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరినీ సల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆమె వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్లు స్వాతి, సీనియర్ నాయకులు రత్నారెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్‌గుప్తా, రాజ్‌కుమార్, మల్లికార్జున్‌గౌడ్, రవినాయక్, సందీప్, రమేశ్‌నాయక్, బాబ్యా నాయక్, నరేందర్‌నాయక్ తదితరులున్నారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారమివ్వాలి

పీసీబీ సభ్యుడు సత్యనారాయణ రెడ్డి

అనంతగిరి: భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. బీదర్–మహేశ్వరం 765కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఇండియా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వారు నిర్మిస్తున్న ఈ ట్రాన్స్‌మిషన్ లైన్ టవర్ల నిర్మాణం జిల్లాలోని మర్పల్లి, మోమిన్‌పేట, నవాబుపేట, వికారాబాద్, పూడూర్ మీదుగా సాగుతుందన్నారు. ఎలక్ట్రికల్ లైన్లు, టవర్ల నిర్మాణానికి రైతులు ఒక్కొక్క టవర్‌కు 12 గుంటల భూమిని, ఎలక్ట్రిక్ లైన్ తో మరో 12 గుంటల భూమి కోల్పోతున్నారన్నారు. విద్యుత్ లైన్ వేయడం వలన కేవలం భూమి సేకరించడమే కాకుండా రైతులు అట్టి భూముల్లో , పరిసర భూముల్లో ఇంటి నిర్మాణాలు, గోదాముల నిర్మాణాలు, కూరగాయ పంటలు, పండ్ల తోటలు పెంచుట నిషేధిస్తున్నారన్నారు. ఈ షరతులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నవాబుపేట మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, అనిల్ కుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.